క్లుప్తంగా

జార్జిపేటలో పశుగ్రాస వారోత్సవాలు


పశుగ్రాసంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు సుధ

తాళ్లరేవు: మండల పరిధిలోని జార్జిపేట నంది బొమ్మ వద్ద పశుగ్రాస వారోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డి.బ్రహ్మవేద కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పత్తిగొంది వెటర్నరీ వైద్యురాలు దవులూరి సుధ పశుగ్రాస సాగు గురించి పాడి రైతులకు వివరించారు. పశుగ్రాసం వల్ల పాడిరైతులకు కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇంజరం వెటర్నరీ వైద్యుడు రమణమూర్తి, రైతులు పాల్గొన్నారు.

మండలంలో డివిజన్ స్థాయి గ్రీవెన్స్

ఉప్పలగుప్తం: ప్రతి వారం మండల స్థాయిలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఈ నెల 15వ తేదీ సోమవారం రోజున డివిజన్ స్థాయిలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.వెంకటేశ్వర ప్రసాద్ తెలిపారు. ఈ సమావేశానికి కలెక్టర్‌తో పాటు డివిజన్ స్థాయి అధికారులంతా పాల్గొంటారని ఆయన వివరించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి ఈ డివిజన్ స్థాయి గ్రీవెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఎమ్మెల్యే అశోక్‌కు సత్కారం


ఎమ్మెల్యే అశోక్‌ను సత్కరించిన ఎంటీఎస్ సిబ్బంది

యానాం: నియోజకవర్గ పరిధిలో ఎన్నో ఏళ్లుగా ఫుల్‌టైమ్ క్యాజువల్ లేబర్‌గా పని చేస్తూ ఇటీవలే మల్టీ టాస్కింగ్ స్టాఫ్‌గా రెగ్యులర్ అయిన పలువురు సిబ్బంది శనివారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా వివిధ శాఖల్లో పూర్తి స్థాయిలో విధులు నిర్వహిస్తున్న ఎఫ్‌టీఎల్‌ఆర్‌లకు ఎంటీఎస్‌లుగా పదోన్నతి కల్పిస్తూ పుదుచ్చేరి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఫుల్‌టైమ్ క్యాజువల్ లేబర్‌కు పదోన్నతి ఇవ్వాలంటూ గతంలో తాను సైతం అసెంబ్లీలో ప్రస్తావించడంతో పాటు సీఎం రంగసామికి పలుసార్లు వినతిపత్రం సమర్పించానన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థినికి అభినందనలు


విద్యార్థిని పూర్ణ షర్మిలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పద్మావతి తదితరులు

తాళ్లరేవు: చొల్లంగిపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థిని కోరాటి పూర్ణ షర్మిల శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికైన సందర్భంగా శనివారం పాఠశాలలో అభినందన సభ ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో పూర్ణ షర్మిలను స్కూల్ ప్రిన్సిపాల్ పి.పద్మావతి, వైస్ ప్రిన్సిపాల్ శ్రావణి, ఉపాధ్యాయులు దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పద్మావతి మాట్లాడుతూ షర్మిల చదువులో ముందుండి పదో తరగతిలో మంచి ప్రతిభ కనబరిచిందన్నారు. షర్మిల భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హైమావతి, పరిపూర్ణ, కనకావతి, పార్వతి, రోహిణి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సత్కారం


ఎమ్మెల్యే బుచ్చిబాబును సత్కరిస్తున్న బ్రాహ్మణ సంఘ నాయకులు

ముమ్మిడివరం: స్థానిక నలమాటి కల్యాణ మండపంలో శనివారం నియోజకవర్గ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బుచ్చిబాబును సత్కరించారు. ఈ సందర్భంగా సన్మాన సభలో ఎమ్మెల్యే దాట్ల మాట్లాడుతూ ఎన్నికలలో తనకు సహకరించిన బ్రాహ్మణ సంఘ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆకొండి రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, చెల్లి అశోక్, తాడి నరసింహరావు, దొమ్మేటి రమణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విష సర్పం.. అప్రమత్తం

- వర్షాకాలంలో పెరిగిన పాముల సంచారం
- జాగ్రత్తలు తీసుకోవడం మేలు




అమలాపురం జాతీయ రహదారిపై తిరుగుతున్న రక్త పింజర పాము

ఉప్పలగుప్తం: ఆషాఢ మాసం వచ్చిందంటే చాలు గ్రామీణ ప్రాంతాల్లోని పొలాల్లో, నివాసాల వద్ద పాములు ఎక్కువగా చేరి ప్రజలను హడలెత్తిస్తుంటాయి. ఈ సమయంలోనే వర్షాలు అధికంగా పడటం పొలాల్లో, నివాసాల్లో చెత్త ఎక్కువగా పెరిగి పాముకాటు బాధితులు పెరుగుతుంటారు. ముఖ్యంగా ఖరీఫ్ పనుల్లో నిమగ్నమయ్యే అన్నదాతలు ఎక్కువగా పాము కాటుకు గురవుతుంటారు. అదే విధంగా నివాస ప్రాంతాల్లో చెత్తా చెదారం పెరిగి అపరిశుభ్ర వాతావరణం కారణంగా విషసర్పాలకు ఆవాసాలుగా మారుతున్నాయి. ఒకప్పుడు పొలాల్లో, పల్లెటూర్లలో కనిపించే విష సర్పాలు ఇప్పుడు పట్టణాల్లోనూ ఎక్కువగా కనిపిస్తున్నాయి.

విస్తరిస్తున్న రక్తపింజర

గతంలో అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో తాచుపాము, నాగుపాము, కట్లపాము, పొడపాము, పొరుగుడు పాము అనే విష సర్పాలు కనిపించేవి. ఈ మధ్య కాలంలో ఈ ప్రాంతానికి రక్తపింజర అనే విషపూరితమైన, అతి ప్రమాదకరమైన పాము తరచుగా కనిపిస్తుండడం అందరినీ ఆశ్చర్యపరుస్తుంది. అటవీ ప్రాంతంలో నివసించే ఈ పాము ఈ మధ్య కాలంలో ఎక్కువగా గ్రామాల్లో కనిపిస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో గ్రావెల్ రోడ్లు నిర్మించడానికి తీసుకొచ్చిన గ్రావెల్ మట్టితో కలిసి ఈ పాములు ప్రవేశించి అనేకంగా విస్తరిస్తున్నాయని అంచనా వేస్తున్నారు. ఇటీవల కాలంలో అమలాపురం కలెక్టర్ కార్యాలయంలో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో, అమలాపురం, ఉప్పలగుప్తం సబ్ స్టేషన్లలో, ఉప్పలగుప్తం మండల పరిషత్ కార్యాలయంలో, ముమ్మిడివరం బీఎస్ఎన్ఎల్ కార్యాలయాల్లో పాములు సంచరించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేశాయి. పచ్చని పొలాలను రియల్ ఎస్టేట్ లేఅవుట్లుగా, ఆక్వా చెరువులుగా మార్చేయడంతో విష సర్పాలు నివాస ప్రాంతాల బాట పడుతున్నాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

తాచుపాము, నాగ పాము కాటు వేస్తే వాటి ప్రభావం నరాల వ్యవస్థపై ప్రభావితం చూపిస్తుంది. రక్త పింజర, కట్ల పాము, పొరుగుడు వంటి పాములు కాటు వేస్తే అతి తక్కువ సమయంలోనే రక్తం గడ్డ కట్టి వాటి ప్రభావం ఎర్ర రక్త కణాలపై పడుతుంది. వర్షాకాలంలో నివాసాల చుట్టూ నిల్వ ఉన్న నీటి గుంతలు, చెట్ల పొదల్లో పురుగులు, కప్పలు, ఎలుకలు ఎక్కువగా చేరుతుంటాయి. అవి ఉన్నచోటికి ఆహారం కోసం పాములు వస్తుంటాయి. అందుకే పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ముఖ్యం. నివాస ప్రాంతాల్లో పుట్టలు, పొదలు లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి. వర్షాకాలం ఈదురుగాలులకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుంటుంది. చీకట్లో పాములు కాటు వేసే ఆస్కారం ఎక్కువ కనుక జాగ్రత్తలు తీసుకోవాలి. పొలం గట్లపై ముళ్లపొదలు, పచ్చగడ్డి లేకుండా చూసుకోవాలి. పొలాలకు వెళ్లే రైతులు చెప్పులు, రాత్రి వేళల్లో టార్చిలైటు తీసుకెళ్లాలి. మోకాలి వరకూ ఉన్న రబ్బరు బూట్లు ధరించి కర్రతో చప్పుడు చేసుకుంటూ వెళ్లాలి. ఎవరినైనా పాము కాటు వేస్తే దానిని గుర్తించి మూఢ నమ్మకాలు, పసరు మందులతో కాలం వృథా చేయకుండా బాధితుడిని వెంటనే దగ్గరలోని ఆసుపత్రికి తీసుకువెళ్లి ఏఎస్‌వీ(యాంటీ స్నేక్ వీనమ్) ఇంజెక్షన్ చేయించాలి.

రక్త పింజర పాములు కనిపిస్తున్నాయి



పొలాల్లో నీటి ముంపు చేరినపుడు, తుప్పలు తొలగించినపుడు సర్పాలు నివాస ప్రాంతాల్లోకి చేరతాయి. ఇటీవల దూరప్రాంతాల నుంచి తెస్తున్న కంకర లారీల్లో రక్త పింజర పాములు సైతం వస్తున్నాయి. భవన నిర్మాణ కార్మికులు జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలి. పాము కాటు వేస్తే దగ్గరలో ఉన్న ఆసుపత్రిలో చికిత్స తీసుకోవాలి.
– జంపన గణేష్ వర్మ, స్నేక్ క్యాచర్, భీమనపల్లి, ఉప్పలగుప్తం మండలం

సకాలంలో చికిత్స అందించాలి



పాము కాటు వేసిన వారు సకాలంలో ఆసుపత్రికి చేరుకోకపోవడమే మరణానికి ముఖ్యమైన కారణం. పాము కాటు వేస్తే పసర మందులతో ఆలస్యం చేస్తే బాధితుడి ప్రాణాలకే ప్రమాదం. ఆలస్యం చేయకుండా ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యుల సమక్షంలో వైద్యం అందిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడొచ్చు.
– డాక్టర్ కె.లక్ష్మీప్రసన్న, వైద్యాధికారి, భీమనపల్లి పీహెచ్‌సీ, ఉప్పలగుప్తం మండలం

చెరువు కాదిది.. కందికుప్ప రోడ్డు


చెరువులా మారిన కందికుప్ప ఆర్‌అండ్‌బీ రోడ్డు

కాట్రేనికోన: మహిపాలచెరువు–పల్లంకుర్రు ప్రధాన రహదారిలో కందికుప్ప వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డు దుస్థితి ఇది. రోడ్డు బాగా దెబ్బతిని భారీగా గోతులు పడడంతో చిన్నపాటి వర్షమొచ్చినా సరే చెరువును తలపిస్తుంది. శనివారం కురిసిన చిన్నపాటి వర్షానికే ఇదిగో ఇలా తయారైంది. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం, ఇరువైపులా డ్రైనేజీ స్థలాన్ని కొందరు ఆక్రమించుకోవడంతో నీరు దిగేందుకు అవకాశం లేక అక్కడే నిలిచిపోతుంది. దీనివల్ల రోడ్డుపై గోతులు ఎక్కడెక్కడ ఉన్నాయో తెలియక అటుగా వెళ్లే వాహనదారులు ప్రమాదాలకు గురై గాయాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డ్రైనేజీ వ్యవస్థను సరిచేసి నీరు దిగే మార్గం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

సామాన్యుడికి రక్షణగా నిలబడాలి


కోర్టుల ప్రారంభ సభలో పాల్గొన్న ఎల్జీ రాధాకృష్ణన్, సీఎం రంగసామి తదితరులు

యానాం: అధికారంలో ఎవరున్నా న్యాయస్థానాలు సామాన్యుడికి రక్షణగా నిలబడాలని లెఫ్టినెంట్ గవర్నర్ రాధాకృష్ణన్ పేర్కొన్నారు. శనివారం పుదుచ్చేరిలో నాలుగు రీజియన్లకు ఉపయోగకరంగా ఉండే మహిళా కోర్టు, మొబైల్ కోర్టు, ఆర్బిటేషన్ కోర్టు సహా ఏడు కోర్టులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆర్.మహదేవన్ చేతుల మీదుగా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎల్జీ రాధాకృష్ణన్ మాట్లాడుతూ న్యాయం ఆలస్యమవుతుందని అందరి మదిలో ముద్రపడిపోతుందని, దీన్ని మార్చాల్సిన బాధ్యత న్యాయవాదులపై ఉందన్నారు. భారత న్యాయవ్యవస్థపై అందరికీ విశ్వాసాన్ని పెంపొందించడంలో కొత్త అధ్యాయానికి ఈ కోర్టులు తెర తీశాయన్నారు. కార్యక్రమంలో సీఎం రంగసామి, పుదుచ్చేరి ప్రధాన న్యాయమూర్తి చంద్రశేఖరన్, న్యాయమూర్తులు కృష్ణకుమార్, శరవణన్ తదితరులు పాల్గొన్నారు.

ఎరుపెక్కిన గౌతమీ గోదావరి


యానాం వద్ద ఎరుపు రంగులో కనిపిస్తున్న గౌతమీ గోదావరి

యానాం: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గౌతమీ గోదావరి ఎరుపు రంగును సంతరించుకుంది. నాసిక్‌లో పుట్టిన గోదారమ్మ మహారాష్ట్ర మీదుగా తెలంగాణకు వచ్చి భద్రాద్రి రాముడి పాదాలు తాకి అక్కడి నుంచి రాజమహేంద్రవరం మీదుగా గౌతమీ గోదావరిని చేరి సముద్రంలో కలుస్తుంది. ఇటీవల వర్షాలకు ఎర్ర నీరుతో సందడి చేస్తున్న గౌతమీ గోదావరిని చూసేందుకు శనివారం స్థానిక రాజీవ్ బీచ్ వద్దకు సందర్శకులు పోటెత్తారు. మరోవైపు వరదనీరు పోటెత్తుండటంతో మత్స్యకారులు పులస చేపల కోసం తమ నావలతో గోదాట్లో తమ అన్వేషణ మొదలు పెట్టారు.

వాకర్స్ ప్రతినిధులకు సత్కారం


వాకర్స్ ప్రతినిధులను సత్కరిస్తున్న సత్య వరప్రసాద్ తదితరులు

అమలాపురం టౌన్: పట్టణంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి వాకర్స్ కౌన్సిల్ సమావేశం విజయవంతం చేసేందుకు కష్టపడి పనిచేసిన బోర్డు డైరెక్టర్లను క్లబ్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్ శనివారం సత్కరించారు. స్థానిక దుడ్డివారి అగ్రహారంలోని బంగారు, వెండి వర్తకుల సంఘం భవనంలో జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా వాకర్స్ క్లబ్ ఎలెక్ట్ గవర్నర్ సప్పా నాగేశ్వరరావు పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర వాకర్స్ కౌన్సిల్ సమావేశం విజయవంతం చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వలవల వెంకట రెడ్డినాయుడు, ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, చింతలపూడి సత్తిబాబు, పుత్సా కృష్ణ కామేశ్వర్, ఉప్పుగంటి భాస్కరరావు, డాక్టర్ విష్ణుమూర్తి, గుర్రం రామకృష్ణ, పట్నాల రమణలను సత్కరించారు.

అధికారుల నిర్లక్ష్యం.. ఖాళీ కుర్చీలే సాక్ష్యం..

- మొక్కుబడిగా కాట్రేనికోన మండల సర్వసభ్య సమావేశం
- సమావేశానికి ఏకంగా 17 శాఖల అధికారుల డుమ్మా


సర్వసభ్య సమావేశానికి అధికారులు రాక ఖాళీగా ఉన్న కుర్చీలు

కాట్రేనికోన: సర్వసభ్య సమావేశమంటే అధికారులకు లెక్క లేకుండా పోయింది. సమగ్ర సమాచారంతో రావాల్సిన అధికారులంతా మూకుమ్మడిగా డుమ్మా కొట్టేయడం ఆనవాయితీగా వస్తోంది. వైఎస్ ఎంపీపీ సానబోయిన నాగేశ్వరరావు అధ్యక్షతన శనివారం జరిగిన కాట్రేనికోన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలోనూ అదే పునరావృతమైంది. సమావేశానికి 23 శాఖలకు చెందిన అధికారులు సమగ్ర సమాచారంతో రావాల్సి ఉన్నా కేవలం ఆరు శాఖల అధికారులు మాత్రమే హాజరు కావడం అందరినీ విస్మయానికి గురిచేసింది. వ్యవసాయం, డ్రైన్స్, ఐకేపీ, పంచాయతీ రాజ్, అటవీశాఖ అధికారులు హాజరుకాగా రెవెన్యూ, విద్యాశాఖ, ఆరోగ్య శాఖ, ఇరిగేషన్, పోలీసు, ఆర్ అండ్‌బీ తదితర శాఖలకు చెందిన అధికారులు డుమ్మా కొట్టేశారు. ఇది అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యమని సభ్యులంతా మండిపడ్డారు. సంబంధిత 17 శాఖల అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు.

పనులు చేయకున్నా వేలిముద్రలు

పల్లంకుర్రులో ఫీల్డు అసిస్టెంట్‌కు బదులు ఆమె భర్త విధులకు హాజరు కావడంపై సర్పంచి నాతి అలివేణి మండి పడ్డారు. ఉపాధి హామీ కూలీల నుంచి రూ.300 వసూలు చేస్తున్నారని, పనులు చేయకున్నా వేలిముద్రలు వేస్తున్నారని నిలదీశారు.

చిర్రయానం వంతెన నుంచి కాలభైరవస్వామి ఆలయం వరకూ రూ.2.50 కోట్ల ఎన్ఆర్‌జీఎస్ నిధులతో 4.5 కిమీ బిటీ రోడ్డుకు సభ్యులు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నేల కిషోర్, వైస్ ఎంపీపీ ఏడిది అరుణ, మోకా చంద్ర నాగరత్నం, సంగాని మునేంద్రవర్మ, గెద్దాడి సుగుణకుమార్, ర్యాలి వీరబాబు, సర్పంచులు గంటి వెంకట సుధాకర్, నాతి అలివేణి, చెల్లి సురేష్, మల్లాడి బాబ్జి, ఓలేటి నాగేశ్వరరావు, ఆర్‌బీకే చైర్మన్ నాతి సత్యనారాయణ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏడిది సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

లభ్యం కాని మురళీకృష్ణ ఆచూకీ

అలమూరు: అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మోతుగూడెంలో నున్న ఫోర్‌బై కెనాల్‌లో గల్లంతైన వీరి మురళీకృష్ణ(24) ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. దీంతో మురళీకృష్ణ స్వగ్రామమైన ఆలమూరు మండలంలోని చింతలూరులో తీవ్ర ఆందోళన నెలకొంది. స్నేహితులతో విహార యాత్రకు వెళ్లిన మురళీకృష్ణ ఈనెల 12 పుష్ప ఘాట్ బ్రిడ్జి వద్ద ప్రమాదవశాత్తు కాలు జారి కాలువలో పడిపోయాడు. అప్పటి నుంచి పోలీసులు స్థానిక జాలర్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టినా ఇంతవరకూ ఆచూకీ లభించలేదని మురళీకృష్ణ బంధువులు ఆవేదన చెందుతున్నారు. మోతుగూడెం పరిసరాల్లో భారీ వర్షాలు కురవడం వల్ల గాలింపు చర్యలకు అంతరాయం ఏర్పడినట్టు తెలుస్తోంది.

'శ్రేష్ఠ'లో సుజాతకు ఆలిండియా ర్యాంకు



అలమూరు: జాతీయ స్థాయి శ్రేష్ఠ స్కీమ్–2024 పోటీ పరీక్షల్లో సంధిపూడికి చెందిన నేల సుజాత జాస్మిన్ 310 ర్యాంక్ సాధించింది. నిరుపేదలైన చిట్టిబాబు, సునీత దంపతుల కుమార్తె సుజాత జాస్మిన్ స్థానిక ప్రైవేట్ హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి పూర్తి చేసింది. అనంతరం వేసవి సెలవుల్లో సహచర విద్యార్థుల సహకారంతో శ్రేష్ఠ పథకానికి సంబంధించి పరీక్ష రాసేందుకు దరఖాస్తు చేసుకుంది. జాతీయస్థాయిలో ర్యాంకు సాధించింది. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో ఉన్న మోసెస్ జోసెఫ్ సికిలి స్కూల్‌లో సీటు లభించింది. ఈ శ్రేష్ఠ పథకం వల్ల తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు సీబీఎస్ఈ సిలబస్ విధానంలో ఆంగ్ల మాధ్యమంలో ఉచితంగా విద్యను అభ్యసించేందుకు వీలు కలిగింది. సుజాత జాస్మిన్‌ను ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు అభినందించారు.

వయో పరిమితి సడలింపునకు నిరాకరణ

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా గ్రూప్–బీ నాన్ గెజిటెడ్ పోస్టుల భర్తీలో అభ్యర్థులకు రెండేళ్ల వయసు సడలింపునకు కేంద్ర ప్రభుత్వం నిరాకరించింది. కోవిడ్ అనంతరం గ్రూప్–బీ నాన్ గెజిటెడ్ పోస్టుల నోటిఫికేషన్ విడుదలైందని, దీంతో తాము వయోపరిమితిని కోల్పోయామని తమకు అవకాశం ఇవ్వాలంటూ పలువురు నిరుద్యోగులు ప్రభుత్వానికి విన్నవించారు. దీంతో పోస్టుల భర్తీకి అభ్యర్థులకు వయసు సడలింపు ఇవ్వాలంటూ కేంద్రానికి పుదుచ్చేరి ప్రభుత్వం లేఖ రాసింది. అయితే సడలింపునకు నిరాకరిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుందని పేర్కొంటూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ అండ్ పర్సనల్ రిఫామ్స్ శాఖ కార్యదర్శి జయ శంకర్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర నిర్ణయంతో గతంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు యథావిధిగా రాతపరీక్ష నిర్వహించి పోస్టులను భర్తీ చేయనున్నారు.

తాచుపాము హల్‌చల్


పామును పట్టుకుంటున్న గణేష్ వర్మ

అమలాపురం రూరల్: మండలంలోని కామనగరువు పంచాయతీ పరిధిలోని నల్లా సత్యనారాయణ కాలనీలో భారీ తాచు పాము హల్‌చల్ చేసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం రాత్రి కాలనీలోని ఒక ఇంటి బాత్‌రూమ్‌లో తాచుపాము దూరడంతో అందరూ భయభ్రాంతులకు గురయ్యారు. దీంతో స్థానికులు ఉప్పలగుప్తం మండలం భీమనపల్లికి చెందిన స్నేక్‌క్యాచర్ జంపన గణేష్ వర్మకు ఫోన్ చేశారు. గణేషవర్మ అక్కడకు చేరుకుని 8 అడుగుల తాచుపామును పట్టుకుని డబ్బాలో బంధించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి


ఇందుపల్లిలో చిన్నారులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మూర్తి

అమలాపురం రూరల్: వర్షాకాలం నేపథ్యంలో తల్లిదండ్రులంతా చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వీఎస్ఎస్ఎన్ మూర్తి అన్నారు. ఇందుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం చిన్నారులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చొల్లంగి శివాలిని, సీహెచ్ అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

అమలాపురం రూరల్: యర్రమిల్లి సత్యానందం 55వ వర్ధంతిని పురస్కరించుకుని వారి మనవలు, మనవరాళ్లు పట్టణంలోని పేదలకు దుస్తులు పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు. ఈదరపల్లి హరి మనో వికాస కేంద్రంలో విద్యార్థులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో యర్రమిల్లి సత్యానందం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

రాజోలు: ఇంటర్మీడియెట్ చదువుతున్న రాజోలుకు చెందిన జె.రోహిణికి ఏబీవీపీ విద్యార్థి సంఘ నాయకులు శనివారం రూ.8 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. పేదరికం విద్యకు అడ్డు కాకూడదనే ఉద్దేశంతో నిరుపేద విద్యార్థులను గుర్తించి ఆర్థికంగా తోడ్పాటు అందిస్తున్నామని సంఘ నాయకుడు పోలిశెట్టి గణేష్ తెలిపారు. ఆర్థికసాయం అందించిన విద్యార్థి సంఘ నాయకులను పలువురు అభినందించారు. జిల్లెళ్ల ఉదయ్, తాడి శ్రీకాంత్, మేడిచర్ల సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ పేపర్ దినోత్సవం

మలికిపురం: ప్రపంచ పేపర్ బ్యాగ్ డే సందర్భంగా విశ్వేశ్వరాయపురంలోని వివేకానంద ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో పేపర్ బ్యాగ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వారు స్వయంగా తయారు చేసిన పేపర్ బ్యాగ్‌లను ప్రదర్శించి, ప్లాస్టిక్ బ్యాగులను మానేద్దాం, పేపర్ బ్యాగ్‌లను వాడుదాం అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.కరెస్పాండెంట్ పీవీవీ వరప్రసాద్ మాట్లాడుతూ పర్యావరణకు హాని కలిగించే ప్లాస్టిక్ బ్యాగ్‌ల తయారీ పరిశ్రమలను మూసి వేయాలని, పర్యావరణహిత పేపర్ బ్యాగ్‌ల వాడకాన్ని ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు.